క్లుప్తంగా

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



పరిసరాల శుభ్రతను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

దెందులూరు: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరు జాగ్రత్తగా ఉండాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే అనారోగ్యాలు దరిచేరే ప్రమాదముందన్నారు. సీతంపేట, పాతూరు, పోతునూరు గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అంటువ్యాధులపై వివరాలు అడిగితెలుసుకుని, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: గోపన్నపాలెం బీజీబీఓ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా ఫస్ట్ సాధించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు హేమంత్ బాబు, కే నితిన్ చక్రవర్తి, కే సోహన్, సత్య కార్తీక్‌లను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికుల సంక్షేమ విభాగం ప్రారంభం



మాట్లాడుతున్న ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: దెందులూరు శుద్ధికరణమాత దేవాలయంలో భారత కార్మికుల ఐక్య సంఘం అఖిల భారత కథోలిక పీఠాధిపతుల సమాఖ్య అధికారి పూర్వక కార్మికుల సంక్షేమ విభాగం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు ఎస్ అంథోని, జాతీయ కార్యదర్శి సిస్టర్ వజ్రకుమారి, దెందులూరు సంఘస్తులు, ఉపదేశీయులు, యువత, ఆర్‌సీఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న కైకరంలో జిల్లా స్థాయి రైతు సదస్సు

దెందులూరు: ఈ నెల 29న ఉంగుటూరు మండలం కై కరం గ్రామంలో జిల్లాస్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ కేరళ తరహాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని, క్వింటాలకు రూ.500 బోనస్ ప్రకటించాలని, రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రైతులందరూ హాజరై ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రూ.99కే మందు.. నాణ్యత నిల్

- మందుబాబుల పెదవి విరుపు



కూటమి సర్కారు విడుదల చేసిన నాణ్యత లేని రూ.99 మందు సీసాలు

కొయ్యలగూడెం: రూ.99కే మందు వచ్చేసిందోచ్ అంటూ మందు బాబులు పండుగ చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం పేర్కొన్న విధంగా రూ.99కే మద్యం బాటిళ్ల కోసం ఎదురు చూసిన వీరు.. ఆదివారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని ఐదు షాపుల్లో రూ.99 క్వార్టర్ బాటిళ్లు సమృద్ధిగా రావడంతో వాటిని కొనుగోలు చేయడానికి క్యూ కట్టారు. కన్నాపురంలోని షాపు వద్ద ఎగబడి గంటల తరబడి నిలబడి ఈ మందుబాటిళ్లను కొనుగోలు చేయడం కనిపించింది. రూ.99కే నాణ్యత గల మద్యం అందిస్తామన్న కూటమి ప్రభుత్వం.. తీరా ఆచరణలో నాణ్యత లేని మందుబాటిళ్లను సరఫరా చేసిందంటూ వీటిని కొనుగోలు చేసిన అనంతరం మందుబాబులు మండిపడుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ బాబు, ఎస్సై ఎస్‌కే జబీర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకూడదని, ఎక్కడైనా, ఎవ్వరైనా ప్రజా శాంతికి భంగం కలిగించి ఏదైనా సమస్యలు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్‌లు, అనుమానిత వ్యక్తులు తమ సత్ ప్రవర్తన అలవర్చుకుని ఉన్నతంగా జీవించాలని సూచించారు.

భౌబోయ్.. కరిచేస్తున్నాయ్!

- వీధివీధినా శునకాల బెడద
- వాహనదారుల వెంటపడి తరుముతున్న వీధికుక్కలు
- వృద్ధులు, చిన్నపిల్లలపై సైతం దాడులు
- గణపవరంలో ఒకే రోజు 15 మందికి కుక్కకాటు
- నెలకు వందకు పైగా కుక్కకాటు కేసులు



రాత్రి వేళ రోడ్డుపై కుక్కల స్వైర విహారం



కుక్కకాటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన యువకుడు

గణపవరం: గ్రామాల్లో శునకాల బెడద ఎక్కువైంది. ఏగ్రామం చూసినా, ఏవీధిచూసినా డజన్ల సంఖ్యలో వీధికుక్కలు రోడ్లమీద స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్డుమీద వెళ్లే వారిని వెంటపడి తరుముతూ అందితే కండలు పీకుతున్నాయి. మహిళలు, చిన్న పిల్ల ల వెంట సైతం పడుతున్నాయి. కాస్త చీకటి పడితే ఒంటరిగా వీధిలోకి రావాలంటేనే జనం హడలి పోతున్నారు. ఇక లేగదూడలను, పశువులనుకూడా వదలడంలేదు. నాటు కోళ్లను సైతం గుటుక్కుమని పిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ అన్న తేడా లేకుండా గత ఐదారేళ్లుగా ఏగ్రామం చూసినా వీధికుక్కల బెడద ఎక్కువైంది. వీటిసంఖ్య ప్రతి సంవత్సరం పెరిగి పోతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత రెండు మాసాల వ్యవధిలోనే గణపవరం పీహెచ్‌సీలో సుమారు 200 మందికి పైగా కుక్కకాటు బాధితులు వైద్యం చేయించుకున్నారు. ఇక పీహెచ్‌సీలకు రాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందినవారి సంఖ్య మరో వందవరకు ఉంచవచ్చునని అంచనా వేస్తున్నారు. గతంలో ఒక్కో గ్రామంలో పదో, పరకో ఊర కుక్కలు ఉండేవి. ప్రస్తుతం ఏగ్రామంలో చూసినా వందల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. మేజర్ గ్రామాల్లో ఐతే కుక్కలబెడద భారీగానే ఉంటుంది. ఈ కుక్క లు వీధుల్లో గుంపులుగుంపులుగా తిరుగుతూ మరో కుక్కల గుంపు ఎదురైతే అవి ప్రత్యక్ష యుద్ధానికి దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంటపడటంతో వారు కంగారులో కిందపడి గాయాలపాలైన ఘట నలు అనేకం ఉన్నాయి. పశువుల పాకల్లో చేరి లేగదూడలు, మేకలపై సైతం దాడులు చేస్తున్నాయి. ఎంతో కష్టపడి పెంచుకుంటున్న నాటుకోళ్లను సైతం ఎత్తుకుపోతున్నాయని మహిళలు ఆవేదన చెందుతున్నారు. గతంలో పంచాయతీ అధికారులు వీధికుక్కలను అప్పుడప్పుడు పట్టివేసి, సుదూర ప్రాంతాలకు తరలించడంతో కుక్కల బెడద అదుపు లోఉండేది. కొన్నేళ్లుగా జంతు ప్రేమికులు న్యాయ స్థానాల్లో కేసులు వేయడంతో కోర్టు ఆదేశాల మేర కు పంచాయతీలు కుక్కల అదుపుపై తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీనితో గ్రామాలలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని అంటున్నారు. కనీసం గ్రామ పంచాయతీలు కుక్కలకు క్రమం తప్పకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తే వీటి బెడద తగ్గుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్



గణపవరం పీహెచ్‌సీకి నెలకు కనీసం 70, 80 మంది కుక్కకాటు బాధితులు వైద్యం కోసం వస్తున్నారు. ఇటీవలి కాలంలో కుక్కకాటు బాధితుల సంఖ్య బాగా ఎక్కువగా ఉంది. ప్రతిరోజూ కనీసం ఇద్దరు, ముగ్గురు కుక్కకాటుకు గురై ఆస్పత్రికి వస్తున్నారు. వచ్చిన వారందరికి వ్యాక్సిన్ ఇస్తున్నాం. పీహెచ్‌సీలో కుక్కకాటుకు అవసరమైన ఏంటీ రేబిస్ వాక్సిన్ అందుబాటులో ఉంచుతున్నాం.

– పులపర్తి సంతోష్, పీహెచ్‌సీ వైద్యాధికారి

కంటి వైద్య సేవలు అందించలేరా?

దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్



అప్పన ప్రసాద్

దెందులూరు: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కంటి వైద్య సేవలు ఎప్పుడు ప్రారంభిస్తారని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పన ప్రసాద్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దెందులూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నియోజకవర్గస్థాయి వైద్యశాలలో గత ప్రభుత్వ హయాంలో ప్రతిరోజు కంటి వైద్య పరీక్షలు, కళ్లజోళ్ల మంజూరు, కంటి ఎక్స్‌రేలు తీసేవారన్నారు. ప్రతిరోజు 150కు పైగా ఓపీ ఈ వైద్యశాలలో జరిగేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కంటి వైద్య సేవలు నిలిపివేశారని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల ముందు పేదలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ అమలు చేయలేని హామీలన్నీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత కంటి వైద్య సేవలు అందించలేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సామాన్యులు సైతం వేలాది రూపాయలు పెట్టి కంటి వైద్య సేవల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత కంటి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కేటాయించిన షాపులపై రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విక్రయిదారులు సైతం ప్రభుత్వానికి సహకరిస్తూ ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా సురక్షితమైన స్థలాల్లో బాణసంచా విక్రయాలు చేసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, అన్ని గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు

భీమడోలు: గ్రామాల్లో పుట్ట గొడుగుల్లా గొలుసు దుకాణాలు వెలిశాయని, ఇదేనా మంచి ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, భీమడోలు ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో గ్రామగ్రామాన, ప్రతి వీధిలోను, సంతల్లో బెల్ట్ షాపులను పెట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. చిన్న గ్రామాల్లో సైతం 2, 3 గొలుసు దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. ఇదంతా అబ్కారీ శాఖ పోలీసుల కనుసైగల్లో జరుగుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని ఎదురు చూస్తుంటే ఇంటింటికీ మద్యాన్ని తీసుకోవచ్చిన ఘనత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు దక్కుతుందన్నారు. ఎన్నికల హామీలైన ఉచిత ఇసుక, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.1500, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఫించన్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. మద్యం దశల వారీగా అమ్మకాలు తగ్గించారన్నారు. గ్రామాల్లో ప్రజలు విషపు జ్వరాలు డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నా కూటమి ప్రభుత్వం ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదని, కనీసం మందులు ఇచ్చినా పాపాన పోలేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేశారని, ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

వారధి నిర్మాణ పనుల్లో కదలిక



గుండుగొలనులో నిలిచిన వంతెన నిర్మాణం



కాలువలో అమర్చేందుకు సిద్ధం చేసిన భారీ పైపులు

భీమడోలు: జాతీయ రహదారి అనుసంధానంగా గుండుగొలను వద్ద గోదావరి కాలువపై వంతెన నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. ఈనెల 21వ తేదీన ‘వారధి నిర్మాణ పనుల్లో జాప్యం’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై నేషనల్ హైవే, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు స్పందించారు. కాలువను మూసివేసి వంతెన నిర్మిస్తే కాలువ శివారు ప్రాంతాలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కొంతకాలంగా పనులకు తీవ్ర ఆటంకంగా మారింది. దీనిపై నేషనల్, జలవనరుల శాఖ అధికారులు తగు నిర్ణయానికి వచ్చారు. గోదావరి కాలువలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా కాలువలో మూడు మీటర్ల భారీ పైపులను అమర్చేందుకు అవసరమైన ఐరన్ పైపులను పోలవరం ప్రాంతం నుంచి నిర్మాణ ప్రాంతానికి తరలించారు. వాటిని కాలువలో ఉంచి అపై రహదారిని నిర్మించి భారీ క్రేను సాయంతో వంతెన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. దీనితో నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. అనతికాలంలోనే వంతెన నిర్మాణం పూర్తి అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

దెందులూరు: కొవ్వలి గ్రామంలోని చిన్నదళితపేట లో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తు లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. నిందితుల నుంచి రూ.24,330 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోండి

కామవరపుకోట: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు గడవు నవంబర్ 6వ తేదీతో ముగుస్తుందని తహసీల్దార్ జి.ఎలీషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2021 సవంత్సరం ముందు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అని, వారు ఆన్‌లైన్‌లో లేదా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నమూనా ఫారం పూర్తి చేసి దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చునన్నారు. చదువుకున్న యువత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకుని ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మలుపుతో ముప్పు



రావులపర్రు వంతెన వద్ద పొంచి ఉన్న ప్రమాదం

ఉంగుటూరు: తోకలపల్లి కోడుపై రావులపర్రు వంతెన వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. నిడమర్రు మండలంలోని ఫత్తేపురం, తోకలపల్లి, బయనేపల్లి, పెదనింద్రకొలను, ఉంగుటూరు మండలం అప్పారావుపేట ప్రజలు నిత్యం ఈ రహదారిపై పయనిస్తుంటారు. అలాగే నిడమర్రు మండలంలో కొల్లేరు ఆనుకుని ఉన్న వేలాది ఎకరాల చేపల చెరువుల రైతులు ఈ రహదారి మీద వెళుతుంటారు. అయితే ఫత్తేపురం నుంచి నారాయణపురం చేరుకోవడానికి గణపవరం నుంచి నారాయణపురం రహదారిలో తోకలిపల్లి కోడు పైనున్న వంతెన వద్ద కలవాల్సి ఉంది. ఇక్కడ ఉన్న మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఈ మలుపు వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలు అరికట్టవచ్చని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో ‘చదవడం.. మాకిష్టం’



నీతి కథలను వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: గ్రంథాలయాలు.. జ్ఞాన సముపార్జన నిలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తకం పఠనం చేశారు. చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి రోజు చిన్నారులు ఒక గంట సేపు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు గాలాయగూడెంలో రెవెన్యూ రీసర్వే గ్రామసభ

దెందులూరు: గాలాయగూడెం గ్రామంలో మంగళవారం రెవెన్యూ రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వీఆర్‌ఓ దుర్గ తెలిపారు. గాలాయగూడెం పంచా యతీ గ్రామ శివారు ప్రాంతాల్లో రైతులు తమ సమస్యలను గ్రామసభలో లిఖితపూర్వకంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దెందులూరు ఏడీకి డీడీగా పదోన్నతి

దెందులూరు: దెందులూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు డిప్యూటీ డైరెక్టర్ (నంద్యాల జిల్లా)గా పదోన్నతి లభించింది. ఆయన స్థానంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా భీమడోలులో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయి రమేష్‌ని నియమించినట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గడ్డం నెహ్రూ బాబు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు.. 9 మంది అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరాలపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. స్థానిక ప్రతిభ స్కూల్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే స్థానిక గరుడపక్షి నగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వంట నూనెల ధరలు సలసల



దెందులూరు: కూరగాయల ధరలే కాక వంట నూనెల ధరలు కూడా మండిపోతుండంతతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. నెలరోజుల్లోనే వంట నూనెల ధరలు అమాంతంగా పెరగడం సర్వత్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల ముందు అధిక ధరలకు కళ్లెం వేస్తాం సామాన్య ప్రజలకు అందుబాటులో ధరలను ఉంచుతాం అంటూ కూటమి నేతలు అన్నిచోట్ల వాగ్దానాలు చేశారు. ప్రజలందరినీ నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. దీనికితోడు కూరగాయల ధరలు, వంట నూనెల ధరలు పెరిగినా పట్టించుకోవడం లేదు. పామాయిల్ గత నెలలో కేజీ రూ.100 ఉంటే ప్రస్తుతం 120 ధర ఉంది. సన్‌ఫ్లవర్ గత నెలలో రూ.104 ఉంటే ప్రస్తుతం రూ.136 ఉంది. వేరుశనగ గత నెలలో కేజీ రూ.150 ఉంటే ప్రస్తుతం అదే ధర వద్ద స్థిరంగా ఉంది. రైస్ బ్రాన్ ఆయిల్ కేజీగత నెలలో రూ.124 ధర ఉంటే ప్రస్తుతం రూ.135 ధర ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గింపునకు చర్యలు తీసుకొని సామాన్యులకు ఊరట కలిగించాలని పలువురు కోరుతున్నారు.

సబ్సిడీపై సరఫరా చేయాలి



వంటనూనెల ధరలు తగ్గేంతవరకు కూటమి ప్రభుత్వం సబ్సిడీపై వంటనూనెలను సరఫరా చేయాలి. సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని మానవతా దృక్పథంతో ఆలోచించాలి. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయక, పెరిగిన రేట్లు తగ్గించకపోవడం వలన పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– ప్రసన్న రాణి, గృహిణి, అలుగులగూడెం

పథకాలూ అమలు చేయలేదు



వంట నూనె ధరలు పెరిగినా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. ఎన్నికలకు ముందు మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక ప్రగతి, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనం ఎలా ఎన్నో పథకాలు అమలు చేస్తామని చెప్పారు. అవేవీ అమలు చేయలేదు.. కనీసం వంట నూనెల ధరలైనా తగ్గించాలి.

– కృష్ణవేణి, గృహిణి దెందులూరు

సామాన్యులకు భారం



వంట నూనెలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులకు భారంగా మారాయి. ధరలు తగ్గిస్తాము అంటూ అధికారంలోఉన్న పాలకులు ప్రచార సాధనాల్లో ప్రకటనలు చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ధరలు తగ్గడంలేదు. కూటమి ప్రభు త్వం సామాన్యులకు ఊరట కలిగించే విధంగా ఏవిధమైన చర్యలు తీసుకోలేదు.

– ఎం.దుర్గాకుమారి, గ్రామ సర్పంచ్, మేధినరావుపాలెం

గరికపాటి ఆర్ట్స్ సేవలు చిరస్మరణీయం



గుడిపాటి లలితకు ఏఎన్‌ఆర్ పురస్కారం అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో కళలను ఆదరిస్తూ, కళాకారులను విశేషంగా ప్రోత్సహిస్తున్న గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సేవలు చిరస్మరణీయమని సినీ విజ్ఞాన విశారద, నంది అవార్డు గ్రహీత ఎస్‌వీ రామారావు అన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి, పుల్లాభొట్ల శ్రీరామమూర్తి ప్రాంగణంలో గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఎన్‌ఆర్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కళా సంస్థ 50 కార్యక్రమాలు నిర్వహించడమే విశేషంగా చెప్పుకుంటామని, అలాంటిది గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఇప్పటి వరకూ 269 కార్యక్రమాలు నిర్వహించడం ఒక రికార్డుగా నిలుస్తుందన్నారు. కాగా గత పదేళ్లుగా కళారంగంలో ప్రఖ్యాతి గాంచిన కళాకారులకు ఏఎన్‌ఆర్ అవార్డును అందిస్తూ వారిని గౌరవించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గత పదేళ్లుగా ఏఎన్‌ఆర్ అవార్డును అందచేసేందుకు అవకాశం కల్పించిన ఎస్‌వీ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తూ కళలకు జీవం పోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఏఎన్‌ఆర్ పురస్కార గ్రహీత గుడిపాటి లలిత మాట్లాడుతూ తనను ఏఎన్‌ఆర్ పురస్కారానికి ఎంపిక చేయటం ఆనందదాయకమన్నారు. అనంతరం నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి రత్న శిరీష గుడిపాటి విశ్వనాథ్ ఆలపించిన లలిత సంగీత కార్యక్రమంగా అమ్మవారి కీర్తనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి వారికి పి.సుధీర్, కె.కల్యాణ్ (తబలా) వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సరస్వతి, రిటైర్డ్ ఫిజిక్స్ హెచ్‌ఓడీ పి.సుబ్బలక్ష్మి, నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజీవలి, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, ఎంవీఆర్ఎస్ శర్మ పాల్గొన్నారు.

ఏజెన్సీలో పెరుగుతున్న చలిగాలులు

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో గత నాలుగు రోజులుగా చలి విజృంభిస్తుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు దంచికొడుతుంటే సాయంత్ర సమయానికి చలిగాలులు వీస్తున్నాయి. అదేవిధంగా తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంటుంది. చలితీవ్రత కారణంగా శ్వాసకోస సంబంధిత వ్యాధులు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.